క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్ సోమవారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న లడ్డూ తయారీ పోటు, అన్నప్రసాద భవనం ఈ నెలాఖరుకు భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. రానున్న దసరా ఉత్సవాల్లో ఈ రెండు భవన నిర్మాణాలు కీలకం కానున్న నేపథ్యంలో వాటిని సిద్ధం చేయాలని అవసరమైతే సిబ్బందిని పెంచి త్వరగా పూర్తి అయ్యేలా కాంట్రాక్టర్‌ను ఒప్పించాలని అన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు



పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛంద సంస్థలు చేసే సమాజ సేవను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. పటమటలోని దర్శిపేటలో ఉన్న నల్లూరి కళ్యాణమండపంలో పటమట వెంకటేశ్వరస్వామి దేవస్థానం, సృహోస్టి ట్రస్ట్ అమరావతి ఐ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సంస్థ మందులు అందిస్తుందని, ఇలాంటి వైద్య శిబిరాలను మరిన్ని నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఫౌండర్ నల్లూరి వెంకట సుబ్బారావు, కార్యనిర్వహణ అధికారి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి



పటమట(విజయవాడతూర్పు):నగరవాసులకు వీఎంసీ అందించే మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నగరవాసుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని 64 డివిజన్లలో ఉన్న సమస్యలను వివరించేందుకు ప్రజలు కార్యాలయానికి వస్తారని వారిపై దురుసుగా ప్రవర్తించవద్దని సూచించారు. సమస్యలు క్షుణ్ణంగా తెలుసుకుని పరిష్కారం చూపాలని కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగాక ఫిర్యాదు దారులకు వారి ఫిర్యాదుపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తెలిపారు. మొత్తం 13 ఫిర్యాదులు రాగా, అందులో పట్టణ ప్రణాళికపై -10, ఇంజినీరింగ్ -1, రెవెన్యూ -1, పబ్లిక్ హెల్త్ -1 అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, పర్యవేక్షణ ఇంజినీర్లు పి. సత్య కుమారి, పి. సత్యనారాయణ, డెప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరనగర్‌లో గంజాయి బ్యాచ్ ఆగడాలు



పటమట(విజయవాడతూర్పు): పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల గంజాయిబ్యాచ్ చేసే ఆగడాలు శృతి మించుతున్నాయి. గతంలో రోడ్డున పోయేవారిని మాత్రమే అడ్డగించి దాడులకు పాల్పడే వాళ్లు. ఇప్పుడు ఏకంగా రాత్రుళ్లు ఇళ్ల తలుపులు బాదుకుని లోపలకు చొరబడి డబ్బుల కోసం ఇంటిలోని వారికి కూడా బయటకు లాక్కొచ్చి మరీ దాడులకు తెగబడుతున్నారు. తాజాగా పటమట ప్రాంతంలోని రామలింగేశ్వనగర్ గాంధీ కాలనీలో శనివారం రాత్రి ఒంటిగంటకు పదిమంది రాడ్లు, కర్రలు పట్టుకుని ఇంటిడోర్లు, పార్కింగ్ చేసిన బైక్‌లు, ఒంటరిగా ఉన్న వారి ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టించారు. అడ్డుకుందామని వెళ్లిన వారిపై కూడా దాడి చేసి భయాందోళన సృష్టించారు. సుమారు గంటన్నరకు పైగా జరిగిన ఈ తతంగంపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరూ రాకపోవటంతో భయాందోళనతో జీవనం సాగించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. పటమట రామలింగేశ్వరనగర్‌లో రోజురోజుకు పెరిగిపోతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టాలని పటమట ఎస్ఐ పి.కృష్ణ వర్మకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

షాదీఖానా లక్ష్యానికి అధికారుల తూట్లు

- నిర్వహణను గాలికి వదిలేసిన మైనార్టీ సంక్షేమ శాఖ
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- అడ్రస్ లేని డ్రైయినేజి వ్యవస్థ
- ఎటు చూసినా అపరిశుభ్రత



విద్యాధరపురం గుప్తా సెంటర్ వద్ద గల ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేద ముస్లిం మైనార్టీలు నామమాత్రపు ఛార్జీలతో వివాహాలు చేసుకునేందుకు గతంలో నగరంలో పలు షాదీఖానాలను నిర్మించారు. అందులో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా నివసించే పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతం విద్యాధరపురం గుప్తా సెంటర్‌లో నిర్మించిన ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా ఒకటి. దీనిని నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి లేక పోగా షాదీఖానా నిర్వహణ చూస్తే నానాటికీ తీసికట్టుగా తయారయింది. దీని నిర్వహణ బాధ్యతలను చూడాల్సిన ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ పూర్తిగా గాలికి వదిలేసింది. షాదీఖానా నిర్వహణ కోసం మైనార్టీ సంక్షేమ శాఖ స్థానిక ముస్లిం మైనారీలతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. పర్యవేక్షణ మాత్రం ఆ శాఖకు చెందిన అధికారే చూసుకోవల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారి నెలలో ఒక్కసారైనా వచ్చి మెయింటెనెన్స్ ఎలా ఉంది అని చూసుకుంటూ ఉంటే ఇప్పుడు ఈ అధ్వాన పరిస్థితి ఉండేది కాదని స్థానిక ముస్లిం మైనార్టీలు వ్యాఖ్యానిస్తున్నారు.

గట్టు వెనుక ప్రాంతంలో ముస్లిం మైనార్టీల ఫంక్షన్ల కోసం నిర్మించిన షాదీఖానా లక్ష్యాన్ని సంబంధిత అధికారులు తూట్లు పొడిచారు. ఇక్కడ ముస్లిం మైనార్టీలు వివాహాలు, ఫంక్షన్లు చేసుకునేందుకు గతంలో రోజు అద్దెకు రూ.2వేలు మాత్రమే వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. అద్దె కాకుండా విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.20, మున్సిపల్ చార్జి (ఫంక్షన్ అయిన తరువాత శుభ్రం చేసేందుకు) రూ.500, వాచ్‌మెన్‌కు రూ.500 అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ అద్దెలతో పోలిస్తే ఇది చాలా తక్కువే. అయితే షాదీఖానా లోపల గానీ ఆవరణలో గానీ ఎక్కడా పరిశుభ్రత అనేది కనబడదు.



షాదీఖానా లోపల విశాలమైన హాల్



చుట్టూ పిచ్చి మొక్కల నడుమ నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్

డ్రైయినేజి వ్యవస్థ అడ్రసే ఉండదు. ఇక్కడ ఎప్పుడో నిర్మించిన టాయిలెట్స్ వినియోగంలో లేక వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా పడి ఉన్నాయి. వివాహాలు, ఫంక్షన్లు చేసుకునేవారితో పాటు, వచ్చిన వారి బంధువులు, స్నేహితులు అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లాలో తెలియని దుస్థితి నెలకొంది. అద్దెకు తీసుకున్న అనేక మంది తమ అవస్థలను కమిటీ సభ్యులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

కమిటీ కాలపరిమితి ముగిసి ఏడాది దాటినా...

ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా నిర్వహణ కమిటీ సభ్యుల కాలపరిమితి గత ఏడాది డిశంబర్ నెలకే ముగియగా ఇప్పటి వరకు కొత్త కమిటీని వేయకపోవడంలో ఆంతర్యమేమిటో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికే తెలియాల్సి ఉంది. షాదీఖానా ఆదాయ, వ్యయాలు, కమిటీ కార్యకలాపాలు, నిర్వహణను పర్యవేక్షించాల్సిన మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి అసలు పట్టదని, అందుకే షాదీ ఖానా మెయింటెనెన్స్ అధ్వానంగా ఉందని పలువురు స్థానిక ముస్లిం మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ అద్దెకు దొరుకుతుంది కదా తీసుకోండని ఎవరికైనా చెబుదామన్నా టాయిలెట్స్ లేవని చెప్పటానికి సిగ్గేస్తుందని అంటున్నారు. ప్రస్తుతం కమిటీ ఎటూ లేదు కాబట్టి కొత్త కమిటీ వేసే వరకు స్థానిక ప్రజాప్రతినిధులుగానీ సంబంధిత శాఖ అధికారులుగానీ షాదీఖానా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కేసు ఎత్తెయ్..లేదా పెళ్లి చేసుకో..

యువతిని బెదిరించిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తనపై పెట్టిన కేసు ఎత్తివేసుకోవాలని లేదా పెళ్లి చేసుకోవాలంటూ ఓ యువతిని బెదిరించిన ఘటన భవానిపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానిపురం హెచ్‌బీ కాలనీకి చెందిన యువతి డిప్లమా రెండో సంవత్సరం చదువుతోంది. గతంలో యువతి ఇంటికి ఎదురుగా ఉంటున్న అశోక్‌కుమార్ అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి గర్భవతిని చేశాడు. అప్పట్లో అతనిపై పోక్సో కేసు నమోదైంది. అతను ఇటీవల బెయిల్‌పై విడుదల అయ్యాడు. ఆమెను రోడ్డుపై ఆపి తనను పెళ్లి చేసుకోవాలని, లేదా కేసు విత్‌డ్రా చేసుకోవాలని బెదిరించాడు. ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున యువతి ఇంట్లో చొరబడి గొడవ చేశాడు. ఆమె పీక నొక్కే ప్రయత్నం చేయగా యువతి కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

యథాతథంగానే చెన్నై బస్సు

సాక్షి ఎఫెక్ట్..

ఆటోనగర్(విజయవాడతూర్పు):చెన్నై బస్సు సర్వీస్‌ను వేరే డిపోకు బదలాయింపు చేయడాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారులు నిలుపుదల చేశారు. గత 15 సంవత్సరాల నుంచి ఈ సర్వీస్ ఆటోనగర్ నుంచి చెన్నైకు నడుపుతున్నారు. ఇటీవల ట్రాన్స్‌పోర్టు మంత్రి ఒక సమావేశంలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ బస్సును కాకినాడకు బదిలీ చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో విజయవాడ నుంచి కాదు... ఇక కాకినాడ నుంచి చెన్నై బస్సు అనే కథనం ఇటీవల సాక్షిలో ప్రచురితమైంది. ఈ వార్తకు ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ బస్సు ఉండటం వల్ల తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల వారికి అనువుగా ఉంటుంది. ఇంజినీరింగ్ విద్యార్థులు వెళ్లడానికి ..రావడానికి సౌకర్యవంతగా ఉంటుంది. దీంతో విజయవాడ నుంచి ఉదయం సాయంత్రం ఉన్న రెండు చెన్నై సర్వీస్‌లు యథాతథంగానే నడుస్తాయని ఆటోనగర్ డీఎం ప్రవీణ్ కుమార్ చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోగికి కచ్చితమైన వ్యాధి నిర్ధారణ ఎంతో కీలకం



లబ్బీపేట(విజయవాడతూర్పు):రోగికి కచ్చితమైన, వేగవంతమైన వ్యాధి నిర్ధారణ జరిగినప్పుడే, అవసరమైన చికిత్స అందించగలుగుతారని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అన్నారు. విజయవాడలోని వైద్య కళాశాలలో సోమవారం ల్యాబొరేటరీ అంతర్గత ఆడిట్, నాణ్యత నిర్వాహణ వ్యవస్థలు అనే అంశంపై శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. . నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు పీజీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ఈ శిక్షణలో సిద్ధార్థ, ఎన్ఆర్ఐ, గుంటూరు వైద్య కళాశాలకు చెందిన మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ విభాగాలకు చెందిన 60 మంది పీజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ల్యాబొరేటరీల్లో అంతర్గల ఆడిట్ ప్రక్రియలు, వివిధ పరికరాలకు సంబంధించిన నాణ్యతా నిర్వాహణ వ్యవస్థలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ హెచ్ఓడీ డాక్టర్ వెంకటరావు, బయోకెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ చౌడేశ్వరి, డాక్టర్ శారద పాల్గొన్నారు.

ఆకాష్ స్కాలర్‌షిప్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆకాష్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో అక్టోబరు 4 నుంచి 12 వరకూ నిర్వహించే ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆ విద్యాసంస్థ సీఈఓ దీపక్ మల్హోత్రా ఆవిష్కరించారు. నగరంలోని ఆ విద్యాసంస్థలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించే ఈ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలతో పాటు, స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. ఈ టెస్ట్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ఏడాది 10 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు దగ్గరలోని ఆకాష్ ఇన్స్టిట్యూట్ కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చు.

టూరిజం హోటళ్లు, రిసార్ట్స్ ప్రైవేటీకరణపై ఉద్యోగుల ధర్నా



టూరిజం హెడ్ ఆఫీస్ కార్యాలయ వరండాలో ప్లకార్డులతో ధర్నా చేస్తున్న ఉద్యోగులు



కార్యాలయం లోపల ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పర్యాటక శాఖ ప్రధాన కార్యాలయం వద్ద ప్లకార్డులతో ఆందోళన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన హోటళ్లు, రిసార్ట్స్ నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ సంస్థ ఉద్యోగులు ధర్నాకు దిగారు. విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయం భవనంలో సోమవారం బోర్డ్ మీటింగ్ జరుగుతుందని తెలిసి పర్యాటక శాఖకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనిట్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్, మ్యాన్ పవర్ ఉద్యోగులు అక్కడికి చేరుకున్నారు. బోర్డ్ మీటింగ్ మధ్యాహ్నం 3 గంటల తరువాత మొదలై రాత్రి 7 గంటల వరకు జరిగినట్లు ఉద్యోగులు తెలిపారు. ఈలోగా కొంతమంది ఉద్యోగులు కార్యాలయం లోపల, మరి కొంతమంది కార్యాలయం వరండాలో 'సంస్థను నమ్ముకున్న మాకు ద్రోహం తలపెట్టవద్దు', 'లాభాల్లో ఉన్న యూనిట్లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం అన్యాయం', సుమారు రూ.63 కోట్ల మేర లీజు బకాయిలను వసూలు చేయండి' తదితర డిమాండ్లతో కూడిన ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. బోర్డ్ మీటింగ్ అనంతరం సంస్థ ఉన్నతాధికారులు వారిని పిలిపించుకుని మాట్లాడారు. తాము గత కొన్ని దశాబ్దాల నుంచి సంస్థ అభివృద్ధికి కృషి చేశామని, ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే తమ ఉద్యోగాలకు భద్రత ఎక్కడ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో ఉద్యోగులను కొనసాగించేలా ప్రభుత్వంతో మాట్లాడతామని అధికారులు చెబుతుండగా మరో వైపు బోర్డ్ చైర్మన్, డైరెక్టర్లు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించలేమని చెప్పటం గమనార్హం.

దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశభక్తిని చాటి చెప్పేలా మువ్వన్నెల జెండాలను చేతపట్టుకుని బీజేపీ చిట్టినగర్ మండల ఆధ్వర్యంలో చిట్టినగర్ సెంటర్ నుంచి కేఎల్ రావు నగర్ వరకు సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సన్నాహక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్ మధుకర్, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, శ్రీనివాస రాజు, గౌతం పబ్లిక్ స్కూల్ అధినేత ఎన్ సూర్యారావు, ర్యాలీ ఇన్‌చార్జ్ పిట్టల గోవింద్, జిల్లా బీజేపీ కోశాధికారి అవ్వారు బుల్లిబ్బాయి, కార్యదర్శి పైలా సురేష్ బాబు, చిట్టినగర్ మండల అధ్యక్షులు దేవిన హరిప్రసాద్, పీ బేసుకంతేశ్వరుడు, నక్కెట్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన తేజేష్‌కు అభినందన



తేజేష్‌ను సత్కరిస్తున్న ఆంజనేయులు, ఈశ్వర్ బాబు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దక్షిణ కొరియాలో ఇటీవల నిర్వహించిన 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో వివిధ విభాగాలలో ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు సాధించిన పడిగ తేజేష్‌ను సత్కరించారు. కృష్ణా మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు తేజేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తేజేష్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి భవిష్యత్‌లో ప్రపంచ స్థాయిలో పతకాలను సాధించి రాష్ట్రం, దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. బాల్యం నుంచి క్రీడల వైపు వైపు ప్రోత్సహించి గొప్ప క్రీడాకారుడిగా తీర్చిదిద్దుతున్న తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. పడిగ తేజేష్ మాట్లాడుతూ తనకు స్పాన్సర్ చేసి ప్రోత్సహిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్మికులపై పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న రాజా తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటింటా చెత్త సేకరణలో పారిశుద్ధ్య కార్మికులు అదనపు పని భారంతో ఒత్తిడికి గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా పేర్కొన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని 39వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో కనీసం పది మందికిపైగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఉన్నవారిపైనే అదనపు పని భారం పడుతుందన్నారు. అయినా కార్మికుల సంఖ్య పెంచకుండా ఉన్నవారిపై ఒత్తిడి తీసుకువచ్చి ఎక్కువ గంటలు పని చేయించడం కార్మిక చట్టాలకు వ్యతిరేకమని అన్నారు. నగరంలో అదనంగా కనీసం 1500 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం ఉండగా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా తక్కువ సంఖ్యలో ఉన్న కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి ఉన్నవారిపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్వీ చలం, గౌరవ అధ్యక్షుడు జక్కి జేమ్స్, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి తుర్లపాటి



బ్రహ్మానందరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి తుర్లపాటి కుటుంబరావు అని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళా భారతి, జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు జయంతి గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం నిర్వహించారు. జంధ్యాల శంకర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాత్రికేయరంగంలో విలువలు చాటుకున్న మహనీయుడు తుర్లపాటి సేవలను నేటి తరం యువ పాత్రికేయులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్నేహానికి మారుపేరు తుర్లపాటి అని పేర్కొన్నారు. అటు రాజకీయరంగం, ఇటు పత్రికారంగంలోనూ ఆయనకు శత్రువులు లేరన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ ఆయన దాదాపు 50 సంవత్సరాలపాటు వార్తలలోని వ్యక్తి పేరుతో శీర్షికను ఒక పత్రికలో నిర్వహించారని చెప్పారు. రాష్ట్రంలోని పలువురు ముఖ్యమంత్రులతోనూ నాటి ప్రధాని ఇందిరా గాంధీతో మొదలు కొని నేటి ప్రధాన మంత్రి మోడీతో వర్తమాన సమస్యలపై ఉత్తరాలు రాసేవారన్నారు. కార్యక్రమంలో గోళ్ళ నారాయణరావు, బోడి ఆంనేయరాజు, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు, కె. డేవిడ్‌రాజు, బి.వీరభద్రరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావును నిర్వాహకులు సత్కరించారు. గాయనీ గాయకులు పలు చిత్రగీతాలను ఆలపించారు. తుర్లపాటి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా జరగాలి




ఎన్టీఆర్‌కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు):వీఎంసీ పాలుపంచుకునే ఎలాంటి వేడుకైనా వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా జరగాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌యం అన్నారు. టిక్కిల్ రోడ్డు, క్రీస్తురాజుపురం, ఎన్టీఆర్ కాలనీ, కనకదుర్గ వారధి, కృష్ణలంక ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీఎంసీ-రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఎలాంటి వేడుకైనా సరే సంబంధిత ప్రాంతంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి చెత్త బుట్టలో వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలని ప్రజారోగ్య శాఖాధిపతి డాక్టర్ కె. అర్జునరావును ఆదేశించారు. ప్రజలు కూడా తమ ఇంట్లో లేదా, కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహించుకున్నప్పుడు రోడ్డుమీద వ్యర్థాలు వేయవద్దని సూచించారు. వ్యర్థాలు నిర్వహణ పాటించని పక్షంలో జరిమానా విధించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో నగరంలోని పలు ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో క్షేత్రస్థాయి నుంచి అధికారుల వరకు ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కోరారు. అలా ఉన్నపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హుండీ కానుకల లెక్కింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.10.32 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు తెలిపారు. దేవస్థానం కార్యాలయం ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో స్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారి ఎం.రాంబాబు పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. గత 76 రోజులకు గానూ రూ.10,32,522 వచ్చినట్లు వివరించారు.





స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు





స్వాతంత్య్ర వేడుకల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌కు చెందిన విద్యార్థి బృందాలు రిహార్సల్స్ చేస్తున్నాయి. ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాలను సైతం సిద్ధం చేస్తున్న చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ